# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 27-09-2025** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మానవ నాగరికత అభివృద్ధిలో ఖనిజ సంపద కీలక పాత్ర పోషిస్తుందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.**

2. **ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

3. **ఆంధ్ర ప్రదేశ్ వస్తు సేవల సవరణ బిల్లు 2025ను శాసన సభ ఏకగ్రీవంగా ఆమోదించింది.**

4. **తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమశాఖ జీవోను విడుదల చేసింది.**

5. **దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు ఈరోజు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవీగా భక్తులకు దర్శనమిస్తున్నారు.**

==========================

మానవ నాగరికత అభివృద్ధిలో ఖనిజ సంపద కీలక పాత్ర పోషిస్తుందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కల్చరల్ సెంటర్‌లో ప్రతిష్టాత్మకమైన జాతీయ భూ విజ్ఞాన శాస్త్ర అవార్డులు–2024ను ఆమె నిన్న ప్రధానం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కొమ్మవానివలస గ్రామానికి చెందిన సంగంరెడ్డి. శ్యామ్ కుమార్ కు "ఖనిజ ఆవిష్కరణ, అన్వేషణ"లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డు అందజేశారు. ఈయన ప్రస్తుతం విశాఖపట్నంలో సీనియర్ జియాలజిస్ట్ గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో లాజిస్టిక్స్ విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. శాసనసభలో లాజిస్టిక్స్, పరిశ్రమలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాల అంశంపై ముఖ్యమంత్రి నిన్న మాట్లాడారు. రాష్ట్రంలో పోర్టులను అనుసంధానించేలా రహదారులను అభివృద్ధి చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో 14 వేల 966 కిలోమీటర్ల రహదారులను 4500 కోట్ల రూపాయలతో త్వరలోనే చేపడతామని ముఖ్యమంత్రి తెలుపుతూ..

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా డయేరియా వంటి సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా జిల్లా కలెక్టర్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. అమరావతి సచివాలయం నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో దృశ్య మాధ్యమ సమావేశం నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా డయేరియా వంటి కేసులు వస్తే వెంటనే ఆ ప్రాంతాలను పూర్తిగా కంటేయిన్‌మెంట్ ఏరియాగా ప్రకటించి, వివిధ ఫుడ్ స్టాల్స్ ను పూర్తిగా నిలిపివేయడంతో పాటు మంచినీటి పైపు లైన్ల లీకేజీలను పూర్తిగా నియంత్రించాలని చెప్పారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వస్తు సేవల సవరణ బిల్లు 2025ను శాసన సభ నిన్న ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ..... వస్తూ సేవల పన్నులో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ విప్లవాత్మక మార్పు ప్రపంచంలో మరెక్కడా జరగలేదని తెలిపారు. వస్తు సేవల పన్ను వసూలు చేసేటప్పుడు గతంలో నాలుగు స్లాబులు ఉండేవని .. దీనిని సరళీకృతం చేయాలని కేంద్ర ప్రభుత్వం భావించి కూలంకషంగా అధ్యయనం చేసి వేల సంఖ్యలో ఉన్న వస్తువులను రెండు శ్లాబులకు తీసుకువచ్చిందని మంత్రి వివరిస్తూ..

– వాయిస్.. 36 సెకన్లు

---------------------------

రైతులకు సకాలంలో యూరియా, విత్తనాలు అందించడానికి కేంద్ర ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తామని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రానికి యూరియా గత నెలలో కంటే ఈనెలలో మెరుగ్గా పంపిణీ కావడంతో రైతులకు ఎంతో ఊరట కలిగించిందని అన్నారు. ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రానికి మొత్తం 7.88 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందగా, వీటిలో ఒక్క సెప్టెంబర్ నెలలోనే 1.84 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా అయిందని పేర్కొన్నారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. “సేవా పర్వ్” పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. ఇంటర్నెట్ విప్లవం ద్వారా దేశంలోని గ్రామాలు, నగరాలను కేంద్ర ప్రభుత్వం ఎలా అనుసంధానించిందో ఈరోజు తెలుసుకుందాం.

..వాయిస్.. 1.22 సెకన్లు

---------------------------

తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై బీసీ సంక్షేమశాఖ జీవోను విడుదల చేసింది. సంబంధిత కమిషన్ సిఫార్సుల మేరకు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జీవో నంబర్ 9ని విడుదల చేసింది. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై ఉన్న 50శాతం పరిమితిని ఎత్తివేసి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వాలని ఇటీవల మంత్రి మండలి నిర్ణయించింది.

మరోవైపు ఈనెల 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలని హైకోర్టు గడువు నిర్దేశించడంతో దానికి అనుగుణంగా 42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం ప్రభుత్వం జీవో జారీ చేసింది.

---------------------------

దసరా శరన్నవరాత్రులలో 6వ రోజైన ఈరోజు ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీకనక దుర్గమ్మ శ్రీ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీశైలక్షేత్రంలో దసరా మహోత్సవాలలో భాగంగా 6వరోజైన ఈరోజు అమ్మవారు శ్రీ కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.

మరోవైపు తెలంగాణలో బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఈ రోజు వేపకాయల బతుకమ్మను నిర్వహిస్తున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుమలలో శ్రీవెంకటేశ్వరస్వామి వారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గత రాత్రి ముత్యపు పందిరి వాహనంపై మలయప్పస్వామి కాళీయ మర్దనుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉదయం కల్పవృక్ష వాహన సేవ జరుగనుంది.

---------------------------

వాయవ్య, మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పశ్చిమ దిశగా కదులుతూ ఉత్తరాంధ్ర-దక్షిణ ఒడిశా తీరంలో వాయుగుండంగా బలపడిందని, ఈరోజు దక్షిణ ఒడిశాలోని గోపాల్‌పుర్ వద్ద తీరం దాటవచ్చని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతారవరణ శాఖ అధికారి బి. శేఖర్ తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

మరోవైపు తెలంగాణలో రానున్న రెండురోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

---------------------------

ఆసియా కప్ క్రికెట్ పోటీల్లో భాగంగా నిన్న దుబాయ్ లో భారత్, శ్రీలంక జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా కాగా సూపర్ ఓవర్ లో భారత్ గెలిచింది. మొదట టాస్ గెలిచిన శ్రీలంక తొలుత బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన భారత్ నిర్ణీత ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 202 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన శ్రీలంక 20 ఓవర్లలో 202 పరుగులు చేయడంతో మ్యాచ్ డ్రా అయింది.

======================